క్లుప్తంగా

మాలధారులకు భిక్ష ఏర్పాటు అభినందనీయం



స్వాములతో కలిసి భిక్ష తీసుకుంటున్న గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: అయ్యప్ప మాలధారులకు, భవాని, శివ మాలధారులకు గత దశాబ్దకాలంగా అయ్యప్పస్వామి ఆలయంలో దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రశంసించారు. నరసాపురం రోడ్డులోని శ్రీ స్వామి అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారుల అన్నసమారాధనను బుధవారం గుడాల గోపి ప్రారంభించి అనంతరం మాలధారులతో కలిసి భిక్ష స్వీకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ చల్లా బాబులు స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పామాయిల్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



పెనుగొండలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

పెనుగొండ: ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఆయిల్ ప్యాకెట్ లను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం రాహుల్ కుమార్ రెడ్డి పెనుగొండ మండలం పెనుగొండలో ఆయిల్ అమ్మకం స్పెషల్ కౌంటర్ ను, రీ సర్వేపై గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు, వెంకట సుబ్రహ్మణ్యం రైస్ మిల్లు, రైతు సేవా కేంద్రంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత స్పెషల్ ఆయిల్ కౌంటర్ ను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఆయిల్ ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పామాయిల్ రూ.110కే అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కౌంటర్ నందు అమ్మకాలు తక్కువగా జరగడం గుర్తించిన జేసీ విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై గ్రామ సభలో వచ్చిన పిటిషన్లను పరిశీలించారు. మ్యూటేషన్స్ ఎందుకు ఫైల్ అవ్వడం లేదు? అని ఆరా తీశారు. మ్యూటేషన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారా? లేక మరి ఏ విధమైన కారణంతో దరఖాస్తు చేసుకున్నారా? అని స్వయంగా దరఖాస్తుదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ పూర్తి అయిన వెంటనే ఫిర్యాదు రిసాల్వ్ చేస్తామని తహసీల్దార్ జాయింట్ కలెక్టర్ కు తెలియజేశారు. అనంతరం పెనుగొండలోని వెంకటసుబ్బయ్య రైస్ మిల్లును సందర్శించి అన్‌లోడ్ అవుతున్న ధాన్యాన్ని పరిశీలించారు. ట్రక్ షీట్ వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పెనుగొండ తహసీల్దార్ జి.అనిత కుమారి, మండల వ్యవసాయ అధికారి స్పందన ఉన్నారు.

నేటి సాయంత్రం కుళాయిల బంద్

నరసాపురం: పట్టణంలో హెడ్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో మరమ్మతులు కారణంగా గురువారం సాయంత్రం పూట కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలిపేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం పూట నుంచి మళ్లీ యథావిధిగా సరఫరా పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఫిర్యాదులను సమన్వయంతో పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మొగల్తూరు: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులంతా సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులను సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, డాక్టర్ దినేష్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మొగల్తూరు: దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. బుధవారం మొగల్తూరులోని కుక్కలవారి తోటలోని భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దివ్యాంగులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ పడవల మేరీ, ఉపాధ్యాయులు వి.గంగాధరరావు, రోజిలిన్ పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న ఎండుగడ్డి ధరలు

- సాగు విస్తీర్ణం తగ్గడంతో ఎండు గడ్డికి డిమాండ్
- ఎకరా గడ్డి రూ.7 వేల నుంచి రూ.10 వేలు



మొగల్తూరులో అమ్మకానికి తీసుకువచ్చిన ఎండుగడ్డి

మొగల్తూరు: ఈ ఏడాది సార్వా సాగు ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలకు తోడు తుఫాన్‌ల ప్రభావంతో మొగల్తూరు మండలంలో వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. సాగు చేసిన పొలాల్లో కూడా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంట నేలపాలవడంతో అటు ధాన్యం తడిసిపోయి ఇటు ఎండు గడ్డి పనికి రాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలో సుమారు 640 ఎకరాల్లో సాగు చేపట్ట గా పంట చేతికోచ్చే సమయంలో మరోసారి తుఫాన్ కారణంగా చేలు నేల రాలాయి. ఇటీవల తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందుగానే వరి కోతలు వేగంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో యంత్రాలతో కోతలు కోయించారు. అయితే యంత్రాల ద్వారా కోసిన గడ్డి చిన్న చిన్న ముక్కలుగా ఉండటంతో పశువులు మేసేందుకు ఇష్టపడవు. మనుషులు చేత కోయిద్దామన్నా వాతావరణం అనుకూలించకపోవడంతో వరికోత మెషీన్లపైనే ఆధారపడ్డారు. దీంతో ఈ ప్రభావం ఎండు గడ్డిపై పడింది. మండలంలో తీవ్రస్థాయిలో ఎండుగడ్డి కొరత ఏర్పడిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరికోత మెషీన్ ద్వారా కోసిన గడ్డి ఎకరానికి రూ 7 వేలు, మనుషులు కోసిన గడ్డి రూ.10 వేలు చొప్పున కృష్ణా జిల్లా, మన జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుండి ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చి నిల్వ చేసుకుంటామని పాడి రైతులు చెబుతున్నారు.

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

మండలంలో గతంలో సార్వా రెండు వేల ఎకరాలు, దాళ్వా సాగు సుమారు మూడు వేల ఎకరాల్లో చేసేవారు. అయితే వివిధ కారణాలరీత్యా వ్యవసాయ రైతులంతా ఆక్వా రైతులుగా మారిపోయారు. మిగిలిన కొద్దిపాటి మంది రైతులు సాగు ప్రారంభంలో ప్రకృతి ప్రకోపానికి సాగుకు దూరంగా ఉన్నారు. దీంతో ఈ ఏడాది కేవలం 640 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టారు. అయితే సాగు ఆరంభం నుంచి వరుణుడు వదలకపోవడంతో సాగు ఆలస్యమైంది. దీంతో ఇప్పటి వరకు కేవలం 140 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తికాగా మిగతా భూములు కోయాల్సి ఉంది. అయితే గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో కోతలు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కోసిన పనలు నీటిలో ఎక్కవ రోజులున్నా పశువులు గడ్డిని తినవు. దీంతో ధర ఎంతైనా కోనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో 16 వేల పశువులు

మొగల్తూరు మండలంలో గిత్తలు, ఎద్దులు, ఆవులు కలిపి సుమారు 3422 ఉండగా, గేదెలు సుమారు 13,262 ఉన్నాయి. ఈ పశువులు వేసవిలో నీటిని ఎక్కువగా తాగుతాయి కాబట్టి రోజుకు కేవలం 3 లేదా4 కేజీల గడ్డి సరిపోతుంది. అదే వర్షాకాలం, శీతాకాలంలో రోజుకు 8 నుండి 10 కేజీల గడ్డి అవసరమవుతుంది. దీంతో అధిక ధరలు వెచ్చించి గడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు.

గడ్డి దొరకడం కష్టంగా ఉంది



వరి కోత యంత్రాల ద్వారా కోయడంతో ఆ గడ్డి పశువులకు పని చేయదు. ఎక్కడ నుండైనా కొందామంటే దొరకని పరిస్థితి. తొందరగా ఒబ్బిడి చేసుకుందామనే ఆలోచనతో రైతులు వరికోత యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు.

– పిప్పళ్ల హరిప్రసాద్, రామన్నపాలెం

గడ్డికి గిరాకీ పెరిగింది



తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు చేలు నేలరాలాయి. తడిసిన ధాన్యం ఆరెబెట్టినా ఉపయోగం ఉంటుంది. అయితే రోజుల తరబడి పనలు నీటిలో ఉండి కుళ్లిపోవడంతో పశువులు గడ్డిని ముట్టుకోవు. దీంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చే గడ్డి కోసం ఆధారపడాల్సి వస్తుంది.

– కడియం నర్సింహమూర్తి, పిప్పళ్ళవారితోట

కొప్పర్రు సుబ్రహ్మణేశ్వరుడికి వెండి పడగ సమర్పణ



కొప్పర్రులో సుబ్రహ్మణేశ్వరునికి వెండి పడగ సమర్పిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్ దంపతులు

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రులో ఉన్న శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గ్రామానికి చెందిన దాత పోలిశెట్టి శ్రీనివాస్, సునీత దంపతులు వెండి పడగను సమర్పించారు. బుధవారం స్వామివారికి ఈ ఆభరణాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఈ వెండి పడగను తయారు చేయించి స్వామివారికి సమర్పించారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల సంగీత కళాపరిషత్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఘంటసాల 102వ జయంతి వేడుకలు పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద బుధవారం ఘంటసాల సంగీత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల విగ్రహానికి పరిషత్ గౌరవాధ్యక్షుడు కొల్లి నరసింహమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయకులు బొక్కా నరసింహమూర్తి, వీఎస్ఎన్ మూర్తి, కేఎస్‌వీడీ ప్రసాద్ ఘంటసాల పాడిన పాటలు, భక్తి శ్లోకాలు, యుగళ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, వారిజా లిల్లీ గోపరాజు గోపి, తిరుపతిరాజు, జీఎస్ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

యలమంచిలి: మండలంలోని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి పంచాయతీ పరిధిలో ఈ నెల ఆరు నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుల్లో భూ ఆక్రమణ, భూ సమస్యలు, రీసర్వే సమస్యలు, జాయింట్ అకౌంట్ సమస్యలు, సెక్షన్ 22ఎ, ఇతర రెవెన్యూ సంబంధిత సేవలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పవన్ కోరారు.

పెనుగొండలో..

పెనుగొండ: ప్రభుత్వ ఆదేశాల ననుసరించి ఈనెల 6 నుంచి 21వ తేదీ వరకూ గ్రామ స్థాయి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆచంట తహసీల్దారు కనకరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో రైతులు వారివారి భూముల వివరాలు, సర్వే సమస్యలు, ఇతర భూ సమస్యలు,ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గత సదస్సులలో వచ్చిన దరఖాస్తుల్లో అధిక భాగంగా పరిష్కరించామన్నారు. దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేసి రసీదు ఇస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం



ఆచంట పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రిని తీసుకువస్తున్న దృశ్యం

పెనుగొండ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వ సిద్ధం చేసినట్లు ఆచంట తహసీల్దారు కనకరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయన్నారు. ఆచంటలోని ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాట చేసినట్లు వివరించారు. గురువారం దయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆచంట మండలంలో 63 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెనుగొండలో..

పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 156 ఓట్లు ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



మొగల్తూరు: ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పాలకొల్లు సెంట్రల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ దుర్గా కిశోర్

మొగల్తూరు: పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొగల్తూరు ఉన్నత పాఠశాలలో కేటాయించిన 116వ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల అధికారులకు, సిబ్బందికి తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఉపాధ్యాయులు 21 మంది, పురుష ఉపాధ్యాయులు 66 మంది ఉన్నారని, ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి మోహనరావు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు ఎం.నాగేశ్వరరావు,ఎం వి.కిశోర్, ఎం .సత్యనారాయణ, వీఆర్ఓ డి.సత్యనారాయణ, ఏఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా పాలకొల్లు పట్టణంలో బీఆర్ఎంవీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. పాలకొల్లులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 480 మంది ఓటర్లు పీఎస్ నెంబర్ 113లో తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ యడ్ల దుర్గాకిశోర్ ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన డ్రై డే సందర్భంగా బుధవారం పట్టణంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న శ్రీనివాసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమల వివరాలు సేకరించాలి



నరసాపురం రూరల్: మాట్లాడుతున్న పరిశ్రమల అభివృద్ధి అధికారి



పెనుగొండ: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ శిక్షణ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో ఉన్న గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు గానూ సర్వే నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల అభివృద్ధి అధికారి శ్రీపతి తెలిపారు. బుధవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ఈ సర్వేకు సంబంధించిన వివరాలను గురించి ఆయన వివరించారు. సర్వేలో భాగంగా గ్రామాల్లోని అన్ని రకాల వ్యాపార, వర్తక, వాణిజ్య సంస్థల వివరాలను సేకరించి వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సహాయాన్ని పొంది అభివృద్ధి చెందాలనుకునే వారి వివరాలను ఎంఎస్ఎంఈ సర్వే యాప్‌లో పొందుపరచాలన్నారు. ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఈఓపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్రకుమార్‌బాబు, ట్రైనర్లు టి.రవివర్మ, ఎ.కిరణ్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైసెస్ పథకం వల్ల కలిగే లబ్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజెప్పాలని నరసాపురం డీఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు అన్నారు. బుధవారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ పథకంలో భాగంగా గ్రామాలలో యూనిట్ల స్థాపనకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ నిచ్చారు. ఎంపీడీఓ టీఎస్ఎన్ మూర్తి, ఏఓ ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 42 లక్షలతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త 5 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ శాఖ అధికారులు

పెనుమంట్ర: మార్టేరులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మూడు నెలల క్రితం పేలిపోయిన 5 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో ఎట్టకేలకు బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు రూ. 42 లక్షలతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. 8200 డొమెస్టిక్, 1200 కమర్షియల్, 43 ఫిష్‌ట్యాంకులకు విద్యుత్ కనెక్షన్‌లు ఉన్న ఈ సబ్‌స్టేషన్‌లో రెండు 5 ఎంవీ పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌లు పని చేసేవి. అయితే ఈ కనెక్షన్‌లతో లోడ్ ఎక్కువై మూడు నెలల క్రితం ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో అధికారులు కొత్త ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు. సత్యవరం, కొయ్యేటిపాడు గ్రామాలకు ఆలమూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వినియోగదారులు కూడా ఇబ్బందులు ఏర్పడడంతో రెండు సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు మొర పెట్టుకోవడంతో ఎట్టకేలకు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ కె.మధుకుమార్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ బి.రఘు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వారతిప్పలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మొగల్తూరు: రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వారతిప్ప ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిచాంచారు. సుమారు 35 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి వివరాలను ఆన్‌లైన్ చేశామని వైద్య సిబ్బంది తెలిపారు. హెచ్ఎం సూర్యప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది దొంగ నీలిమ, కృప పాల్గొన్నారు.

అసంబద్ధ నిర్ణయాలు తగవు



ఎంఈఓ రామకృష్ణంరాజుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

యలమంచిలి: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను, చర్యలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ బుధవారం యూటీఎఫ్ నాయకులు మండల విద్యాశాఖ అధికారి–2 కనుమూరు వెంకట రామకృష్ణంరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి రామమూర్తి నాయుడు మాట్లాడుతూ పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థులు వివరాలు అపార్ నమోదు ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయని విమర్శించారు. ఎంఈఓలు నిబంధనలప పేరుతో అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్.జయప్రభ, దేవ సుధాకర్, వర్ధనపు సందీప్ కుమార్, పెచ్చెట్టి నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఓపెన్ ఆడిటోరియం పనులు

- నిధుల విడుదలను ఆపిన కూటమి సర్కార్
- శాసన మండలిలో కూడా ప్రస్తావించిన ఎమ్మెల్సీ వంక రవీంద్ర



కూటమి సర్కార్ నిర్వాకంతో అసంపూర్తిగా ఉన్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: పట్టణంలో ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే చాలా మంది ప్రైవేట్ కల్యాణ మండపాలను బుక్ చేసుకోవడం పరిపాటిగా మారింది. అయితే కల్యాణ మండపం బుకింగ్‌కు లక్షల్లో ఖర్చు అవుతుండడంతో సామాన్యులు ఇంటి బయట చిన్నగా ఫంక్షన్లను మమ అనిపిస్తున్నారు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక, అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఆ సమస్యకు, కష్టానికి చెక్ పడే విధంగా అడుగులు వేశారు. నిరుపయోగంగా ఉన్న పట్టణంలోని మునిసిపల్ ఓపెన్‌ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేస్తే అందరికీ అనువుగా ఉంటుందని ఆ దిశగా అడుగులు వేశారు. నరసాపురంలో తక్కువ అద్దె ఖర్చుతో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని భావించి పనులు మొదలు పెట్టి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. పనులు చివరి దశలో ఉండగా ఎన్నికలు రావడం, పనులు నిలిచిపోయాయి. మంజూరైన నిధులను సైతం కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

రూ.3.50 కోట్లతో నిర్మాణం

గత వైఎస్సార్ సీపీ సర్కార్ మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం ప్రారంభించింది. పాత భవనాన్ని కూల్చేసి అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం దాదాపు పూర్తిచేశారు. మరో 10 శాతం చిన్నపాటి పనులు మాత్రమే మిగిలిఉన్నాయి. ఈ పనులు పూర్తయితే ఫంక్షన్స్ చేసుకోవచ్చు. కానీ గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రస్తుతం ప్రభుత్వం కక్ష కట్టినట్టు నిలిపేసింది. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రస్తావించారు. నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరి ప్రభుత్వం స్పందిస్తుందో లేదో చూడాలి.

విలువైన స్థలం ఉన్నా..

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా కూడా మున్సిపాలిటీ ఆదాయం పెంచుకునే మార్గంపై గతంలో టీడీపీ హయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టలేదు. అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో ఫంక్షన్స్ చేసుకునే వెసులుబాటు కల్పించే యోచన చేశారు. దానిని కొనసాగించలేక ఇప్పుడు కూడా కూటమి సర్కార్ పాత పద్ధతినే అవలంభించడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఓపెన్ ఆడిటోరియం పనులను చేపట్టి వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.